Published in Eenadu Telugu Daily News Paper on 08.02.2015



# ఆధునిక పరిజ్ఞానం... అన్నదాతకు ప్రయోజనం

- మూడు దశాబ్దాలుగా రైతు సేవలో ట్రాక్టర్ నగర్
- దేశంలోనే గార్లదిన్నెకు ప్రత్యేక గుర్తింపు



గార్లదిన్నె సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాక్టర్ నగర్

గార్లదిన్నె, న్యూస్‌టుడే

కరవు జిల్లాగా పేరొందిన అనంతలో అన్నదాతల ఆవేదనను అర్థం చేసుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యంత్రాలను తయారు చేసి కూలీల భారం తగ్గించడం కోసం కేంద్ర ప్రభుత్వం స్థాపించిన ట్రాక్టర్‌నగర్ మూడు దశాబ్దాలుగా రైతు సేవలో తరిస్తోంది. గార్లదిన్నెకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కృషి యంత్రముల శిక్షణ పరీక్షణ సంస్థ (ట్రాక్టర్‌నగర్) తన పనితీరుతో దేశంలోనే గార్లదిన్నెకు ప్రత్యేక స్థానం తీసుకొచ్చింది. రైతుల ఉపయోగార్థం కేంద్ర ప్రభుత్వం మధ్యప్రదేశ్‌లో బుధిని, హర్యానాలోని ఇస్సార్, ఆంధ్రప్రదేశ్‌లో గార్లదిన్నె, అస్సాంలలో ఒకటి చొప్పున ఇలాంటి సంస్థలు నెలకొల్పారు. గార్లదిన్నెలో 1983లో 463 ఎకరాల విస్తీర్ణంలో అధునిక భవనాలతో పాటు సిబ్బందికి నివాస గృహాలను నిర్మించారు. 150 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర ప్రభుత్వ భవనాలతోపాటు ఇక్కడికి శిక్షణ కోసం వచ్చే విద్యార్థులకు వసతి సదుపాయం కూడా కల్పించారు. దేశం నలుమూలల నుంచి అధునిక యంత్ర పరికరాలను ఇక్కడ పరీక్ష చేయడానికి అవసరమైన అధునిక హంగులతో కూడిన పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే వివిధ రకాల పంటలతోపాటు యంత్రలను పరీక్షంచడానికి 350 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రైతులకు అధునిక యంత్రాలపై శిక్షణ ఇస్తారు. ప్రయివేటు కంపెనీల్లో ఉత్పత్తి చేసిన యంత్రాలు ఈ సంస్థలో పరీక్షించిన తర్వాత వీరిచ్చే ధ్రువీకరణ పత్రం ఉంటేనే బయట మార్కెట్లలో విక్రయించానికి అనుమతి లభిస్తుంది. ఇందు కోసం ఇక్కడికి వచ్చిన ప్రతి యంత్రాన్నీ రైతుల పొలాల్లో పరీక్షించిన తర్వాత దాన్ని సామర్థ్యాన్ని నిర్ధారిస్తారు.



ఆధునిక యంత్రంతో వేరుసెనగ పంట తొలగింపు

### దేశ నలుమూలల నుంచి శిక్షణకు రాక..

ట్రాక్టర్‌నగర్‌కు రైతులు మాత్రమే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి విశ్రాంత ఉద్యోగులు, ఇంజినీరింగ్ విద్యార్థులు, మహిళా రైతులు శిక్షణకు వస్తుంటారు. ఒక్కో బృందానికి మూణ్నెల్లపాటు శిక్షణ ఇస్తారు. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి 25935 మంది శిక్షణ పొందారు. వివిధ సంస్థలు కొత్తగా తయారు చేసే యంత్రాలను పరీక్షించడానికి ఇక్కడి శిక్షణ కేంద్రానికి పంపుతారు. సదరు యంత్రాల్లో ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారు? ఎంత సొమ్ము వెచ్చించారు? గతంలో ఇలాంటి యంత్రాలకు ఎంత ఖర్చయ్యేది? ప్రస్తుత యంత్రం వల్ల రైతులకు ఒరిగే ప్రయోజనాలేంటి? తదితర అంశాలపై విద్యార్థులు, ఔత్సాహికులకు శిక్షణ ఇస్తారు. ఇంజిన్ల తయారీలో వాడిన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు. శిక్షణ కోసం వచ్చే వారికి కోసం అన్ని ఏర్పాట్లూ ఇక్కడ ఉన్నాయి.

### క్షేత్రస్థాయిలో అవగాహన..

వీరు ఆవిష్కరించిన లేదా ఇతర సంస్థలు కనిపెట్టిన ఆధునిక యంత్రాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తారు. బీడుభూములను అధునిక యంత్రాలతో దుక్కులు చేయడం, వరికోతను తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో యంత్రాల సాయంతో పూర్తిచేయడం, వరినాట్లు వేయడం, కలుపుమొక్కలు తీసేయడం, వేరుసెనగ పంటను తొలగించడం వంటి పనులపై ఇక్కడ ఆధునిక యంత్రాల సాయంతో చేసి చూపిస్తారు. బుక్కరాయసముద్రంలోని రెడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి ఎంతోమంది రైతులు వచ్చి వీటిని తిలకించడమే కాకుండా కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరచూ రైతులతోపాటు అక్కడి ప్రజాప్రతినిధులు ఈ సంస్థను సందర్శించి ఆధునిక యంత్రాల గురించి తెలుసుకుంటారు.



శిక్షణ పొందుతున్న కడప జిల్లా ఇంజినీరింగ్ విద్యార్థులు



ట్రాక్టర్ ఇంజన్ పరికరాలను పరిశీలిస్తున్న కర్ణాటక విద్యార్థినులు

## రైతుల అభివృద్ధే లక్ష్యం



సంస్థ ద్వారా అనేక మంది రైతులకు అధునిక యంత్రాలపై అవగాహన కల్పిస్తూ రైతు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం. వివిధ రకాల అధునిక వ్యవసాయ యంత్రాల ప్రదర్శనతోపాటు వాటిపై రైతులకు శిక్షణ ఇవ్వడం వారికెంతో ఉపయోగంగా ఉంది. తక్కువ కూలీలతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగుచేయడం, నూర్పిడి చేయడం వంటి పనులను యంత్రాలతో చేయించి చూపిస్తాం. వాటిని రైతులకు అందుబాటులోకి తెస్తాం. ఇంత పెద్దసంస్థ గార్లదిన్నె సమీపంలో స్థాపించడం జిల్లా రైతుల అదృష్టం. అంతేకాక వివిధ రకాల యంత్రాలను నడపటంలోనూ శిక్షణ ఇస్తున్నాం. సంస్థ కల్పిస్తున్న అవకాశాలను రైతులు, నిరుద్యోగ యువకులు, మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవచ్చు.

**- పీకే పాండే, సంస్థ డైరెక్టర్**